సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



ఆక్రమిస్తే అంతే సంగతులు

అటవీ భూముల పరిరక్షణలో భాగంగా ఆక్రమణదారులపై ఆ శాఖ అధికారులు దృష్టిసారించారు. వివరాలు 8లో ▸



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లో బుధవారం రాత్రి తాళం వేసి ఉన్న ఐదిళ్లలో చోరీ జరిగింది. వివరాలు 8లో ▸



శిథిలాల తొలగింపు షురూ

ఇటీవల కూలిన లింగపల్లి గురుకుల హాస్టల్ భవనం శిథిలాలను తొలగిస్తున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సింగూరు సాగునీరు విడుదల



లిఫ్టు ద్వారా నీటి విడుదల చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పుల్‌కల్(అందోల్): ఎట్టకేలకు సింగూరు నుంచి ఆయకట్టుకు సాగు నీరు వదిలారు. సింగూరు ఆయకట్టు రైతుల సాగు ఇక్కట్లపై 'గండ్లు పూడ్చరేం..?' అనే శీర్షికతో బుధవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రాజెక్టు అధికారులు గురువారం లిఫ్టుద్వారా మోటార్లు ఆన్ చేసి ఎడమకాలువకు సాగునీటిని విడుదల చేశారు. ఇటీవల వర్షానికి కాలువలకు పడ్డ గండ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చి వేసి సాగునీటిని సరఫరా చేశారు. సాగునీరు సరఫరా కావడంతో వరి పంటకు జీవం పోసినట్లయింది.

యూరియా కోసం పాట్లు



బీబీపేట్‌లో యూరియా కోసం గుమిగూడిన రైతులు

కల్హేర్(నారాయణఖేడ్): యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడంలేదు. గురువారం మండలంలోని బీబీపేట్ పీఏసీఎస్‌లో యూరియా పంపిణీ చేశారు. బీబీపేట్, ఫత్తేపూర్, పోచాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలిరాగా కొద్దిసేపు వారి మధ్య తోపులాట జరిగింది. చాలామందికి యూరియా దొరకకపోవడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు.

సత్వర న్యాయానికి కృషి చేయాలి: ఎస్పీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న పరితోశ్ పంకజ్

పటాన్‌చెరు టౌన్: స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడి...వారి సమస్యను విని సత్వర న్యాయానికి కృషి చేయాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసి స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నిఘాను కట్టుదిట్టం చేయాలని సూచించారు. సిటిజన్స్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారికి కనిపించే విధంగా ఉంచాలని చెప్పారు. యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రభాకర్, అమీన్‌పూర్ సీఐ నరేశ్, సిబ్బంది ఉన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ కోసం రైతులనుంచి బలవంతంగా భూములను తీసుకోవడానికి నిరసిస్తూ శుక్రవారం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రాంచందర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సారవంతమైన భూములను బలవంతంగా తీసుకుంటున్న ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారాన్ని తక్కువ ఇస్తోందన్నారు. ఏకపక్షంగా నోటిఫికేషన్లు వేసి భూములు తీసుకోవడాన్ని కోర్టు కూడా తప్పుపట్టిందని గుర్తు చేశారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి వెంకట్ హాజరవుతున్నారని చెప్పారు. నిమ్జ్ పరిధిలోని రైతులు తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

డీఆర్‌ఓకు వినతి

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టర్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఆర్ఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ...రెండు నెలల నుంచి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడంలేదన్నారు. ట్రెజరీల ద్వారా వేతనాల చెల్లింపు వల్ల జాప్యం జరుగుతుందన్నారు. ప్రతీ నెల సకాలంలో వేతనాలు అందక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. విషయం తెలుసుకున్న డీఆర్ఓ వెంటనే స్పందిస్తూ మున్సిపల్ కమిషనర్, ట్రెజరీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణమే కార్మికుల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు యశోద,సంజీవ్,మోహన్, సిద్ధమ్మ,నాగమ్మ ఉన్నారు.

పేషీల ప్రక్షాళన

మరో కీలక ఉన్నతాధికారి సీసీపై బదిలీ వేటు

- సదరు అధికారి పనిచేసే మండలానికి పంపిన అధికారులు
- ఇప్పటికే తన పేషీలోని సీసీలను మార్చిన కలెక్టర్ ప్రావీణ్య

కలెక్టరేట్‌లో ఏళ్లుగా పాతుకుపోయి పెద్ద పెద్ద వ్యవహారాలను సైతం నడిపే క్యాంపు క్లర్క్ (సీసీ)లపై కలెక్టర్ ప్రావీణ్య దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఎక్కువకాలం ఒకే చోట పనిచేయడం వల్ల అవినీతి వ్యవహారాల్లో ఆరితేరిన కొంతమందిని నెమ్మదిగా కలెక్టరేట్ నుంచి పంపించే యోచన చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పేషీల్లో ప్రక్షాళన చేపట్టిన కలెక్టర్ తాజాగా మరో ఉన్నతాధికారి వద్ద పనిచేసే సీసీపై బదిలీ వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కలెక్టరేట్‌లో ఆయా ఉన్నతాధికారుల పేషీల ప్రక్షాళన కొనసాగుతోంది. ఇప్పటికే తన పేషీలో పాతుకుపోయిన సీసీ (క్యాంపు క్లర్క్)లను మార్చి వేస్తూ కీలక నిర్ణయం తీసుకున్న కలెక్టర్ ప్రావీణ్య.. తాజాగా మరో కీలక ఉన్నతాధికారి వద్ద పాతుకుపోయిన మరో సీసీని మార్చి వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అతన్ని అయన పనిచేయాల్సిన మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సదరు సీసీపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. భూముల విషయంలో కలెక్టరేట్‌కు వచ్చే బడాబాబులకు వ్యవహారాలను చక్కబెట్టడంలో సదరు సీసీ కీలకంగా వ్యవహరించారు. ఈ క్రమంలో పెద్దమొత్తంలో ముడుపులు చేతులు మారడంలో కీలకంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ప్రావీణ్య తక్షణం అతడి పోస్టు ఉన్న మండలానికి పంపారు. జిల్లా కలెక్టర్‌గా మూడు నెలలక్రితం బాధ్యతలు తీసుకున్న ప్రావీణ్య కీలక నిర్ణయాలు తీసుకుంటున్న విషయం తెలిసిందే.

పేరుకే క్లర్కులు.. నడిపేది పెద్ద వ్యవహారాలు

పేరుకు క్లర్కులైనా పెద్ద పెద్ద వ్యవహారాల్లో వీరి పాత్ర చాలా కీలకంగా మారింది. సదరు అధికారి వద్దకు ఏ ఫైలు త్వరగా వెళ్లాలన్నా వీరు చేతివాటం ప్రదర్శిస్తుంటారనే విమర్శలున్నాయి. బడాబాబుల భూముల వ్యవహారాలు, ప్రజాప్రతినిధుల పైరవీలతో వచ్చే వారికి సంబంధించిన ఫైళ్లు ఉన్నతాధికారుల ముందుకు తీసుకెళ్లి పనులు పూర్తి చేయడంలో వీరు ఆరితేరి పోయారు. ఒకరిద్దరి పనితీరు అయితే సీసీని కలిస్తే సరిపోతుంది..పని అయిపోయినట్లే.. అనే స్థాయికి ఎదిగారంటే వీరు ఏ స్థాయిలో వ్యవహారాలు నడిపారనేది అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులను కలిసి తమ గోడును వెళ్ల బోసుకుందామని వచ్చే సామాన్యులను లోనికి అనుమతించని ఈ సీసీలు పైరవీకారులను, బడాబాబులను, రాజకీయ పలుకుబడి ఉన్న వారిని మాత్రమే లోపలికి పంపిస్తారనేది బహిరంగ రహస్యం. మరోవైపు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాలనాపరమైన విషయాలను చర్చించేందుకు, ఫైళ్లకు సంబంధించిన అంశాలను చర్చించేందుకు కలెక్టర్ వద్దకు వస్తుంటారు. ఇలాంటి జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ సీసీలకు జీ హుజూర్ అనాల్సిన పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని శాఖలకు జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు జిల్లా బాస్‌లుగా ఉంటారు. ఈ స్థాయి అధికారులు ఈ క్లర్కుల వద్దకు వచ్చి వినయం ప్రదర్శించాల్సిన పరిస్థితిలో వ్యవహారాలు నడిపారు.



కలెక్టర్ కార్యాలయం

ఏళ్లుగా పాతుకు పోయి..

జిల్లాలో కొందరు కీలక ఉన్నతాధికారుల వద్ద పనిచేస్తున్న క్యాంపు క్లర్కులు పాతుకు పోయారు. జిల్లాకు ఏ అధికారి బదిలీపై వచ్చినా వారే సీసీలుగా కొనసాగుతుండటం పరిపాటైపోయింది. గతంలో ఓ కలెక్టర్ వద్ద పనిచేసిన ఓ సీసీ..సదరు అధికారి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిపోతే..ఆయనతో పాటే సీసీని కూడా తాను పనిచేసే జిల్లాకు తీసుకెళ్లిన ఘటనలున్నాయంటే వీరి వ్యవహారాలు ఏ స్థాయిలో ఉంటాయనేది అర్థం చేసుకోవచ్చు. ఒకరిద్దరు సీసీలైతే గుట్టుచప్పుడు కాకుండా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయిన కీలక అధికారి సంతకాలను పాత తేదీల్లో పెట్టించుకువచ్చిన ఘనులు కూడా ఉన్నారు. ఇలా క్లర్కులుగా పనిచేసిన వీరిలో కొందరు కోట్లకు పడగలెత్తారు. కీలక ఉన్నతాధికారుల స్థిరాస్తులకు బినామీలుగా ఉన్న సీసీలు కూడా ఉన్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇప్పుడు చాలా ఏళ్లుగా పాతుకు పోయి..తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీలను ఒక్కొక్కరిగా పంపించివేస్తుండటం కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

పంట నష్టం అపారం

- ఆందోళనలో రైతులు
- నివేదిక తయారుచేసిన అధికారులు

జహీరాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో ఖరీఫ్ పంటలు చాలావరకు దెబ్బతిన్నాయి. రూ.వేల పెట్టుబడులు పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నారింజ వాగు పరీవాహక ప్రాంతాల్లో పంట నష్టం అధికంగా ఉన్నట్లు ప్రాథమికంగా అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలో జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలు మండలాల్లో వేసిన పెసర, మినుము,పత్తి, సోయాబిన్, కంది తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెసర, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇక పత్తి చేలలోనీళ్లు నిలిచి కాయలనుంచి పత్తి బయటకొచ్చిందని తెలిపారు. ఇప్పటికే రైతుల పట్టపాస్ పుస్తకాలు, బ్యాంక్ అకౌంట్ నంబర్ తదితర వివరాలను అధికారులు సేకరించారు.



వర్షాలకు దెబ్బతిన్న పత్తి

ప్రభుత్వం ఆదుకోవాలి



భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాం. కోత దశలో ఉన్న పెసర, మినుము పూర్తిగా దెబ్బతింది. పత్తి పంట కూడా రంగు మారుతోంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి.

– శ్రీనివాస్, రైతు కంబాలపల్లి

జాగ్రత్తలు తీసుకోవాలి



భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. నారింజ వాగు ప్రాంతంలో పంట నష్టం అధికంగా ఉంది. ప్రస్తుతం ఉన్న పంటలలో నీరు నిలువ ఉండటం వల్ల చీడపీడల బెడద కూడా పెరగకుండా వ్యవసాయ అధికారులను సంప్రదించి తగు సూచనలు సలహాలు తీసుకోవాలి.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

కూటమి నిరంకుశత్వాన్ని ఖండిద్దాం

- 'సాక్షి'ఎడిటర్, రిపోర్టర్లకు జిల్లా జర్నలిస్టు సంఘాల సంఘీభావం
- కేసులను ముక్తకంఠంతో ఖండించిన ప్రధాన పార్టీల నేతలు

రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కారు 'సాక్షి'పత్రిక విషయంలో వ్యవహరిస్తున్న నిరంకుశత్వాన్ని జర్నలిస్టు సంఘాలు, రాజకీయ పక్షాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. ఏపీ పాలకుల ప్రోద్బలంతో అక్కడి పోలీసులు 'సాక్షి'ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు, విలేకరులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛను హరించేలా అక్కడి పోలీసులు తీరును తప్పుబడుతున్నాయి. ఏపీలో జరుగుతున్న దమననీతిని ప్రతీఒక్కరు ఖండించాల్సిందేనంటున్నారు. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డి, విలేకరులకు జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రధాన రాజకీయ పార్టీల నేతలు సంఘీభావాన్ని తెలిపారు. ఆయా పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘాల నేతల అభిప్రాయాలు వారి మాటల్లోనే. సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :



పత్రికా స్వేచ్ఛను హరించడమే



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి సర్కారు పత్రికా స్వేచ్ఛను హరించేలా వ్యవహరిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఏపీలో జరుగుతున్న దమన నీతిని ప్రజాస్వామ్యవాదులంతా ముక్త కంఠంతో ఖండించాలి. నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ వార్తలు రాస్తున్న 'సాక్షి'పై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదు. 'సాక్షి'ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు, ఈ పత్రికా రిపోర్టర్లపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి.

– బండారు యాదగిరి, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిత్యం ప్రతికలు వెలుగులోకి తెస్తాయి. పత్రికల్లో వచ్చే రాజకీయ విమర్శల వార్తల విషయంలో వచ్చిన ఫిర్యాదులపై పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల ప్రకారం మాత్రమే ముందుకెళ్లాలి.

– చిన్నమైల్ గోదావరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు

హక్కులను కాలరాయడమే



ఏపీలోని కూటమి ప్రభుత్వం 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరాయడమే. 'సాక్షి'ఎడిటర్, రిపోర్టర్లపై కేసులు పెట్టడం అంటే ప్రశ్నించే గొంతు నొక్కడమే.

– అక్కపల్లి యోగానందరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, టెంజు

ఏపీలో నియంతృత్వ పాలన



పత్రికా స్వేచ్ఛను హరిస్తూ ఏపీలోని కూటమి సర్కారు నియంతృత్వ పాలన సాగిస్తోంది. తమను విమర్శించే వార్తలు ప్రచురితమైతే వివరణ ఇవ్వాలే కానీ, పాలకుల ప్రోద్బలంతో పత్రికలపై పోలీసులు కేసులు పెట్టడం సరికాదు. పత్రికల విషయంలో కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి.

– మల్లేశం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి. మెదక్

గొంతు నొక్కే ప్రయత్నమే



పత్రికలపై కేసులు పెట్టడం..ప్రశ్నించే వారి గొంతు నొక్కేలా వ్యవహరించడం ఏ ప్రభుత్వాలకు మంచిదికాదు. నేతలు మాట్లాడిన మాటలు ప్రచురించినందుకు 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు, విలేకరులపై కేసులు పెట్టడం అంటే కక్షసాధింపే అవుతుంది. నిత్యం ప్రజాసమస్యలను వెలికి తీసే పత్రికల గొంతునొక్కడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

– నిర్మలారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు

కక్ష సాధింపు సరికాదు



పత్రికలపై ప్రభుత్వాలు కక్ష సాధింపు చర్యలు మంచిది కాదు. 'సాక్షి'ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు, అక్కడి విలేకరులపై కేసులు పెట్టడం అంటే ఆ ప్రభుత్వం అభద్రతాభావంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. పత్రికల గొంతు నొక్కడం అంటే ప్రజాస్వామ్యాన్ని హరించడం, దాడి చేయడమే అవుతుంది.

– చింత ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

కుమ్మేసిన వాన

- మెదక్‌లో అత్యధికంగా 17 సెం.మీ వర్షపాతం
- కొల్చారంలో 8 సెం.మీ నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

మెదక్‌జోన్: భారీ వర్షంతో మెదక్ మరోసారి అతలాకుతలం అయింది. జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా 3 గంటల పాటు కురిసిన కుండపోత వర్షం కురిసింది. ముఖ్యంగా రాందాస్ చౌరస్తాలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షం నీరు భారీగా నిలిచింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పలు దుకాణాల్లోకి నీరు చేరింది. స్పందించిన మున్సిపల్ అధికారులు అడ్డుగా ఉన్న డివైడర్‌ను జేసీబీతో తొలగించి నీరు దిగువకు వెళ్లేలా చేశారు. అలాగే పట్టణంలోని గాంధీనగర్‌లో పలువురి ఇళ్లలోకి నీరు చేరటంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బృంధావన్‌నగర్, ఫతేనగర్, సాయినగర్, నర్సిఖేడ్ కాలనీలు జలమయం అయ్యాయి. అలాగే మెదక్ మండలంలోని పలు గ్రామాల్లో 17 సెంటీ మీటర్లు, కొల్చారం మండలంలో 8 సెంటీ మీటర్లు, హవేళీఘణాపూర్‌లో 6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.



పట్టణంలోని ప్రధాన రహదారిపై పోటెత్తిన వరద

భూములు గుర్తించి ఫెన్సింగ్ వేయాలి

స్మార్ట్ సిటీ భూముల పరిశీలనలో టీజీఐఐసీ ఎండీ

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు కాబోతున్న నిమ్జ్ పరిసరాల్లో స్మార్ట్ సిటీఏర్పాటు కోసం భూములను పరిశీలించారు. టీజీఐఐసీ ఎండీ శశాంక్, కలెక్టర్ ప్రావీణ్య అధికారులతో కలిసి మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామ శివారులో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా శశాంక్ మాట్లాడుతూ..స్థానిక అధికారులు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ కోసం అవసరమయ్యే భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. త్వరలో అభివృద్ధి పనులకు టెండర్ వేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది. సుమారు 3,200 ఎకరాల విస్తీర్ణంలో రూ.2,300 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అనంతరం నిమ్జ్ ప్రాంతాన్ని మ్యాప్ ద్వారా పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిమ్జ్ ప్రాంతాన్ని మ్యాప్‌లో పరిశీలిస్తున్న టీజీఐఐసీఎండీ, కలెక్టర్, తదితరులు

మొక్కనాటు.. ఫొటో పెట్టు

పాఠశాలల్లో పచ్చని ఆహ్లాదం

- కొనసాగుతున్న 'ఏక్ పేడ్ మా కే నామ్'2.0 కార్యక్రమం
- ఇప్పటివరకు 1,709 మొక్కలు నాటిన విద్యార్థులు

న్యాల్‌కల్ (జహీరాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కల పెంపకంపై దృష్టిని సారించాయి. హరిత హారం, వనమహోత్సవం లాంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా, ఏక్ పేడ్ మా కే నామ్ 2.0 పేరుతో తల్లి పేరిట ప్రతీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 1,709 మొక్కలను విద్యార్థులు నాటగా వాటి ఫొటోలను ఉపాధ్యాయులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు.

ఉపాధ్యాయులకు అవగాహన

జిల్లాలో 864 ప్రాథమిక, 187ప్రాథమికోన్నత, 211 ఉన్నత పాఠశాలలు, 22 కేజీబీవీలు, 10 మోడల్ స్కూళ్లు ఉండగా, 109 గురుకుల, సాంఘిక సంక్షేమ తదితర ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటితోపాటు సుమారు 500 వరకు ప్రైవేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 3.40లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్'కార్యక్రమంలో భాగంగా ప్రతీ పాఠశాల ఆవరణలో విద్యార్థులు తమ తల్లి పేరిట మొక్కలు నాటి వాటి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోర్టల్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలనే అంశాలపై ఎంఈఓలు, శిక్షణ పొందిన ఆర్‌పీలు మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

సరఫరా చేస్తున్న ఉపాధి పథకం సిబ్బంది

అన్ని పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటాలని అధికారులు ఉపాధ్యాయులకు సూచించారు. అవసరమైన మొక్కలను ఉపాధి పథకం సిబ్బంది సరఫరా చేస్తుండగా అవి సరిపోకపోతే ఎక్కడైనా కొనుగోలు చేసి మరీ మొక్కలు నాటాలని స్పష్టం చేశారు. జూలైలో ప్రారంభమైన ఈ కార్యక్రమం జిల్లాలో జోరుగా సాగుతోంది. జిల్లాలో 1,900లకు పైగా పాఠశాలలు ఉండగా ఇప్పటివరకు 164 పాఠశాలల్లో 1,709 మొక్కలు నాటినట్లు సమాచారం. అయితే చాలా పాఠశాలల్లో మొక్కలు నాటినప్పటికీ పోర్టల్‌లో నమోదు చేయలేదని అధికారులు చెబుతున్నారు.


వివరాలు నమోదు ఇలా..

https://ecoclubs.education.gov.in పోర్టల్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, తరగతి, తల్లి దండ్రుల పేర్లు, చదువుతున్న పాఠశాల వివరాలను నమోదు చేయాలి. పాఠశాల ఆవరణలో తల్లితో కలిసి మొక్కలు నాటిన ఫొటోను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత విద్యార్థి తల్లితో కలసి నాటిన ఫొటోతో సర్టిఫికెట్ వస్తుంది.



కల్బెమల్ పాఠశాలలో తన బిడ్డతో కలసి మొక్క నాటుతున్న తల్లి

మంచి కార్యక్రమం



స్కూల్ ఆవరణలో తల్లి పేరిట మొక్కలు నాటడం చాలా మంచి కార్యక్రమం. బిడ్డతో కలసి మొక్కలు నాటడం సంతోషంగా ఉంది. ఈ చెట్ల వల్ల పిల్లలకు, ఉపాధ్యాయులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభించనుంది.

– శకుంతల, విద్యార్థి తల్లి, కల్బెమల్

నెలాఖరుకు పూర్తి చేయాలి



విద్యార్థులు తమ తల్లితో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించాం.

– వెంకటేశ్వర్లు, డీఈఓ

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టీఎల్‌ఎంకు కవిత ఎంపిక



మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్ అర్థమయ్యేలా బోధించిన విధానంలో ఉపాధ్యాయురాలు కవిత రాష్ట్ర స్థాయి టీఎల్ఎం(సమగ్ర శిక్షా)కు ఎంపికయ్యారని ఎంఈఓ మల్లేశం గురువారం తెలిపారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆంగ్లం ఉపాధ్యాయురాలు కవిత బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి టీఎల్ఎం మేళాలో పాల్గొన్నారు. మేళాలో ఆంగ్లం సబ్జెక్ట్‌పై ప్రదర్శన నిర్వహించారు. పలు అంశాలలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించిన విధానం ఆకట్టుకుంది. ఇందులో భాగంగా ఉత్తమ ప్రదర్శనగాను రాష్ట్రస్థాయిలో నిర్వహించే ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు.

అదృశ్యమై.. శవమై ప్రత్యక్షం



సంతోష్ కుమార్

పాపన్నపేట(మెదక్): ఈ నెల 6న ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమై ఏడుపాయల్లో శవమై కనిపించాడు. ఈ సంఘటన మెదక్ పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ పట్టణానికి చెందిన దొంతుల సంతోష్ కుమార్ (42) వ్యాపారం చేస్తున్నాడు. అవివాహితుడైన ఆయన ఓం శాంతి ధార్మిక సంస్థలో సభ్యుడిగా ఉన్నాడు. అయితే ఈ నెల 6న స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చివరికి బుధవారం సాయంత్రం ఏడుపాయల్లోని రెండో బ్రిడ్జికి సమీపంలోని మంజీర నదిలో చెట్టుకు తట్టుకొని ఓ మృతదేహం వేలాడుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. మృతదేహం జేబులో ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా బాధితుడి సోదరుడు అశ్విని కుమార్‌కు సమాచారం అందించారు. బాధిత సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవీదాస్ తెలిపారు.

తీసుకున్న అప్పు తిరిగివ్వలేదని..

యువకుడి ఆత్మహత్య



నరేష్

కొమురవెల్లి(సిద్దిపేట): ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. కొమురవెల్లి మండల కేంద్రానికి చెందిన సిలివేరు నరేష్(27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నారు. పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి విగతజీవిగా కనిపించడంతో వెంటనే అతడిని కింది దింపి చూడగా.. మృతి చెంది ఉన్నాడు. స్నేహితునికి ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వక పోవడంతో మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాని స్థానికులు భావిస్తున్నారు.

జైలు శిక్ష, జరిమానా



ఎక్సైజ్ అధికారులతో మల్లేశం

మునిపల్లి(అందోల్): గంజాయి కేసులో మండలంలోని పెద్దచల్మెడ గ్రామానికి చెందిన గుండాల మల్లేశానికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎండీ నజీర్ పాషా తెలిపారు. గురువారం అదనపు సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించినట్లు తెలిపారు. 2021లో రెండు కిలోల ఎండు గంజాయి అక్రమంగా కలిగి ఉండటంతో అప్పట్లో మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కోర్టులో న్యాయపరమైన ప్రక్రియలను కానిస్టేబుల్ రాములు పర్యవేక్షించినట్లు తెలిపారు.

ఆక్రమిస్తే అంతే సంగతులు

- అటవీ భూమి పరిరక్షణపై దృష్టిసారించిన అధికారులు
- ఆక్రమణదారుల చేతుల్లో ఆరువేల ఎకరాల అటవీ భూములు
- స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతున్న వైనం



బొసులపల్లి వద్ద ఆక్రమణకు గురైన అటవీ భూమిని స్వాధీనపర్చుకున్న అటవీ అధికారులు

రామాయంపేట(మెదక్): అటవీ భూముల పరిరక్షణలో భాగంగా ఆక్రమణదారులపై ఆ శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇందులోభాగంగా ఆక్రమణదారులపై జిల్లా వ్యాప్తంగా కేసులు నమోదు చేసి సదరు భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ భూముల్లో అటవీ అధికారులు మొక్కలు నాటుతున్నారు.

అనుకున్న భూమిని ఆక్రమించుకుని..

జిల్లా పరిధిలో 57 వేల హెక్టార్లకు పైగా అటవీ భూమి ఉంది. గతంలో కొన్ని గిరిజన తండాల్లో ఏళ్ల తరబడి కబ్జాలో ఉన్న వారికి ప్రభుత్వం అటవీ హక్కుల పట్టాలిచ్చింది. ఇలా పట్టాలు పొందిన వారితోపాటు మారుమూల గ్రామాల్లో కొందరు తమ భూములను ఆనుకుని ఉన్న అటవీ భూమిని నెమ్మదిగా ఆక్రమించేసుకుంటున్నారు. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా ప్రతి ఏటా కొంతమేర కబ్జాకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అటవీ అధికారులు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. దీంతోపాటుగా సదరు భూముల్లో దున్నకాలు చేపట్టిన ట్రాక్టర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీన భూమిలో మొక్కలు నాటుతున్న అధికారులు

కాగా ఆక్రమణదారులనుంచి తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్న భూముల్లో అధికారులు ఇప్పటివరకు 40 వేల మొక్కలు నాటారు. మరో 60 వేల మొక్కలు నాటుతామని చెబుతున్నారు.

ఆరు వేల ఎకరాలకు పైగా కబ్జా

జిల్లా పరిధిలో సుమారుగా ఆరు వేల ఎకరాల అటవీ భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. దీంతో రంగంలో దిగిన అటవీ అధికారులు దాడులు నిర్వహిస్తూ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గత జూలైలో రామాయంపేట మండలం బాపనయ్య తండాలో ఐదెకరాలమేర అటవీ భూమి కబ్జాకు గురైనట్లు తెలుసుకున్న అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకుని ఆక్రమణదారులపై కేసు నమోదు చేశారు. గతేడాది హవేళీఘనపూర్ మండల పరిధి తండాల్లో ఆక్రమణకు గురైన భూములను విడిపించే క్రమంలో గిరిజనులకు, అటవీ సిబ్బందికి మధ్య ఘర్షణలు జరిగిన సంగతి తెలిసిందే.

ఆక్రమిస్తే కఠిన చర్యలే



అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొన్ని మండలాల్లో కేసులు నమోదు చేశాం. స్వాధీనం చేసుకున్న భూముల్లో 40 వేల మొక్కలు నాటాం.

– జోజి, జిల్లా అటవీ అధికారి

ఇందిరమ్మ ఇళ్లకు 8 ట్రాక్టర్ల ఇసుక

ఖేడ్‌లో ఇసుక బజార్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



జెండా ఊపి ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలతోపాటు 8 ట్రాక్టర్ల ఇసుకను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని మార్కెట్ యార్డు ప్రక్కన గురువారం ఇసుక బజార్‌ను సబ్‌కలెక్టర్ ఉమాహారతితో కలిసి ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఇసుక పంపిణీని ప్రారంభించారు. అంతకుముందు ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో 69వ స్కూల్‌గేమ్ ఫెడరేషన్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ...గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదన్నారు. ప్రజా పాలనలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శి, గృహనిర్మాణ శాఖ అధికారులను సంప్రదించి ఇసుకను పొందవచ్చన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ముఖ్యమని తమకు నచ్చిన ఆటల్లో నైపుణ్యాలను అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, గృహనిర్మాణశాఖ పీడీ చలపతిరావు, డీఈ తివారీ, ఏఈ వంశీ, తహసీల్దారు హసీనాబేగం, క్రీడల జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్, జిల్లాలోని పీడీలు, పీఈటీలు, నాయకులు వినోద్‌పాటిల్, రమేశ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన మిథున్ కుమార్ భార్య పిల్లలతో కలిసి పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ వెంచర్‌లో ఉంటూ పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 3వ తేదీన రోజు మాదిరిగానే పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం వేసి ఉంది. భార్య ఆశ కుమారి, ఇద్దరు కుమారులు రితిక్ కుమార్ (7), యాష్ కుమార్ (3) కూతురు ఖుషి కుమారి (3) కనిపించలేదు. భార్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణం వరకు పనులు పూర్తి

మల్లన్న ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్



నివేదిక విడుదల చేస్తున్న ఆలయ ఈఓ వెంకటేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న కల్యాణం నాటికి ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఈవో టంకశాల వెంకటేశ్ తెలిపారు. గురువారం ఆలయంలో కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ ఉద్యోగులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒక సమగ్ర నివేదికను విడుదల చేశారు. దాతల సహకారంతో నిర్మించబోయే 100 వసతి గదులకు సంబంధించి ప్లాన్, ఎస్టిమేట్‌లను, మేడలమ్మ, కేతమ్మలకు బంగారు కిరీటం కోసం బంగారాన్ని ముంబైలోని ప్రభుత్వ మింట్ ద్వారా కరిగించడానికి అనుమతి కోసం దేవాదాయ శాఖకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మల్లన్న గుట్టపై నిర్మాణం చేపడుతున్న త్రిశూలం, ఢమరుకం పనులకు నిధులు సరిపోక పోవడంతో రూ.84.15 లక్షలకు పరిపాలన అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. రూ.12కోట్లతో నిర్మాణం చేపడుతున్న క్యూ కాంప్లెక్స్ పనులు 70 శాతం పూర్తి అయ్యాయని తెలిపారు. బండ గుట్టపై 50 వసతి గదుల పనులు పూర్తి కావచ్చాయని, త్వరలోనే మిగతా పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్, పర్యవేక్షకులు, సురేందర్ రెడ్డి, శ్రీరాములు, మధుకర్ పాల్గొన్నారు.

మొన్న తల్లి.. నేడు తండ్రి మృతి

- చిన్నారుల పరిస్థితి దైన్యం
- వెంటాడిన వరుస విషాదాలు
- గౌరారంలో విషాదం



తండ్రి శవం వద్ద చిన్నారుల బేలచూపులు

వర్గల్(గజ్వేల్): విధి ఆడిన వింత నాటకం.. రెండు నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులు, అమ్మమ్మ.. కానరాని తీరాలకు చేరారు. దీంతో చిన్నారులు ప్రేమకు దూరమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన వెల్దుర్తి మంజునాథ్ సెలూన్ నిర్వహిస్తుంటారు. భార్య కవిత వికలాంగురాలు. నయనిక(13), అక్షయ్(10) ఇద్దరు పిల్లలున్నారు. ఇల్లరికపు అల్లుడు కావడంతో అత్త భారతమ్మ వారితోనే ఉండేది. సాఫీగా సాగుతున్న ఆ కుటుంబాన్ని అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. తమ అనారోగ్యానికి తోడు అల్లుడు కూడా తీవ్రఅనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం (జులై 10న) చిన్నారుల తల్లి కవిత, అమ్మమ్మ భారతమ్మ పురుగుల మందు తాగి బలవన్మరణం చెందారు. ఆ విషాదం మరవకముందే గురువారం తండ్రి మంజునాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. తండ్రి మృతదేహం వద్ద పిల్లల బేలచూపులు చూస్తుండటంతో చూపరులు కన్నీంటి పర్యంతమయ్యారు. వృద్ధులైన తాత శివరాములు, నానమ్మ పెంటమ్మ, బంధుగణం దుఃఖసాగరంలో మునిగిపోయారు. పదేళ్ల కుమారుడు అక్షయ్ తలకొరివి పట్టి అంత్యక్రియలు నిర్వహించి తండ్రి రుణం తీర్చుకున్నాడు. ఈ ఘటనతో గౌరారంలో విషాదం అలుముకున్నది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



నర్సింగ్‌రావు



మహేశ్



ఆంజనేయులు

జిన్నారం(పటాన్‌చెరు): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని దాదిగూడెంకు చెందిన ఎంకిరిగారి నర్సింగ్‌రావు (58) అమీన్‌పూర్ పట్టణం సుల్తాన్‌పూర్ పరిధిలోని ఓ పరిశ్రమలో విధులకు హాజరై బైక్‌పై వెళ్తున్నాడు. నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ గ్రామానికి చెందిన బత్తుల మహేశ్(26) కొడకంచి నుంచి జిన్నారం వైపు బైక్‌పై వెలుతున్నాడు. ఈ క్రమంలో పట్టణ శివారులోని శివాజీ స్టేడియం వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ హనుమంత్ ఘటనా స్థలికి చేరుకొని ఇద్దరిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహేశ్‌కు చిన్న వయస్సు గల ఇద్దరు కూతుర్లు, ఓ కొడుకు ఉన్నారు. నర్సింగ్‌రావుకు నలుగురు కూతుర్లు ఉన్నారు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు ఢీకొని..

మనోహరాబాద్(తూప్రాన్): అతి వేగం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రెండు బైకులు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం.. ముప్పిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు(31) బైక్‌పై పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన జాజుల మహేందర్ తల్లి బాలమణిని తన స్కూటీపై ఎక్కించుకుని గ్రామం నుంచి కాళ్లకల్ వైపు బయలు దేరాడు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న ఆంజనేయులు అతివేగంగా వచ్చి వీరి స్కూటీని ఢీకొట్టి కిందపడి పోయాడు. ఈ ఘటనలో ఆంజనేయులు తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా తీవ్రంగా గాయపడిన బాలమణి, మహేందర్ చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మేకల కాపరిపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడిన రాజు

చేగుంట(తూప్రాన్): మేకల కాపరిపై చిరుత దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని కరీంనగర్ శివారులో చోటు చేసుకుంది. బాధితుడు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పట్నం రాజు గురువారం సమీపంలోని అటవీ ప్రాంతంలో మేకలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో చిరుత మేకపై దాడి చేయగా, గొడ్డలితో చిరుతపై తిరగబడగా వెనుదిరిగి వెళ్లిపోయింది. భయంతో మేకలను తీసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో మరోసారి చిరుత రాజు వద్దకు రాగా బిగ్గరగా అరుస్తూ గొడ్డలితో చిరుతను కొట్టే ప్రయత్నం చేయగా, చిరుత దాడి చేసింది. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, సెక్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ రవికిరణ్ గ్రామానికి చేరుకొని రాజు వీపుపై చిరుత గాట్లను పరిశీలించారు.

కంటి చికిత్సకు ఆర్థిక సాయం



నాయక్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న జగ్గారెడ్డి

దాతృత్వాన్ని చాటుకున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : కంటి చూపు కోల్పోయి అంధుడిగా మారిన సంపూరన్ నాయక్ అనే విద్యార్థికి కంటి చికిత్స కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం రూ.పది లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కందిలో స్థిరపడిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన కిసాన్‌పవార్, శాంతాబాయిల కుమారుడు సంపూరన్ నాయక్‌కు ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడటంతో కోమాలోకి వెళ్లిపోయాడు. తిరిగి కోలుకున్నప్పటికీ..కంటి చూపు పోయింది. నాయక్ కోసం ఇప్పటికే రూ.ఐదు లక్షల వరకు ఆ పేద కుటుంబం ఖర్చు చేసింది. చూపు రావాలంటే రెండు ప్రత్యేక శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ. పది లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. అంత మొత్తాన్ని వెచ్చించే స్థోమత లేకపోవడంతో ఆ కుటుంబం జగ్గారెడ్డిని ఆశ్రయించగా వెంటనే రూ.పది లక్షల నగదును అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

చేపల వేటకు వెళ్లి..

దౌల్తాబాద్ (దుబ్బాక): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలు... మండలంలోని దొమ్మాట కు చెందిన పెద్దోల్ల నారాయణ, యాదవ్వ దంపతుల మూడో కుమారుడు కరుణాకర్ (25) ఓ బాలుడిని తీసుకుని చెరువులో వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో కరుణాకర్‌కు పిడుసు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడితో ఉన్న బాలుడు కేకలు వేయడంతో పక్కన ఉన్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలి ంచారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఒకేసారి ఐదు ఇళ్లల్లో చోరీ
- బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు
- క్లూస్ టీంతో దర్యాప్తు ప్రారంభం



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐలు

నర్సాపూర్ రూరల్: తాళాలు వేసి ఉన్న ఐదు ఇళ్లల్లో దుండగులు చోరీకి పాల్పడి దొరికిన కాడికి దోచుకుపోయారు. బుధవారం అర్ధరాత్రి ఒకేసారి ఐదు ఇళ్లల్లో చోరీ జరగడం కలకలం రేగింది. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలంలోని నారాయణపూర్ ప్రాంతానికి చెందిన నీరుడి స్వరూప, ఎడ్ల పోచయ్య, రొటం ప్రభాకర్, చిన్న బాలమణి, పిచ్చకుంట్ల నర్సింలు ఇళ్ల తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాలు ధ్వంసం చేసి బంగారం, వెండి, నగదు తీసుకెళ్లారు. అయితే నీరుడి స్వరూప ఇంటికి తాళం వేసి గ్రామంలోనే ఉన్న తన కూతురు ఇంట్లో నిద్రించింది. ఆమె ఇంట్లో దొంగలు చొరబడి బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, 20 వెండి గొలుసులు, రూ.60 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఎడ్ల పోచయ్య కుటుంబ సభ్యులు వేరే గ్రామానికి వెళ్లగా దొంగలు తాళం ధ్వంసం చేసి ఇంట్లో ఉన్న 8 తులాల వెండి, రూ 16వేల నగదు దోచుకెళ్లారు. అదే విధంగా రొటం ప్రభాకర్, చిన్న బాలమణి, పిచ్చకుంట్ల నర్సింలు ఇళ్ల తాళాలు ధ్వంసం చిన్న చిన్న వస్తువులు ఎత్తుకెళ్లారు. ఒకే రోజు నారాయణపూర్‌లో తాళాలు వేసిన ఉన్న ఐదు ఇళ్లల్లో చోరీ జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎస్ఐ లింగం, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్‌లు క్లూస్ టీంతో దొంగతనం జరిగిన ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్



పట్టుబడిన నిందితులు

పటాన్‌చెరు టౌన్: చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ సీఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధికి చెందిన రంగారావు గత నెల 26న మార్నింగ్ వాక్ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మెడలో ఉన్న బంగారు చైన్ అపహరించారు. దీంతో బాధితుడు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం ఇస్నాపూర్ చౌరస్తాలో వాహన తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మొయినాబాద్ అజిత్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అబ్బాస్, మాదాపూర్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ షానవాజ్ అదుపులోకి తీసుకొని విచారించారు. ఇస్నాపూర్‌లో చైన్ స్నాచింగ్ తామే చేసినట్లు ఒప్పుకున్నారు. అలాగే వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులు వారి నుంచి 1.3 తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని, బైకు, ఐదు సెల్ ఫోన్లను సీజ్ చేసి వారిని రిమాండ్‌కి తరలించారు.

బైక్ చోరీ

రామాయంపేట(మెదక్): స్థానిక కేఎన్ఆర్ వెంచర్‌లో బుధవారం రాత్రి బైక్ అపహరణకు గురైంది. పుట్టి సందీప్ అనే యువకుడు తన బైక్‌ను ఇంటిముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూడగా కనిపించలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పగలు రెక్కీ.. రాత్రి చోరీలు

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రశాంత్

అక్కన్నపేట(హుస్నాబాద్): పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలు పోలీసులకు పట్టుబడ్డారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ప్రశాంత్ నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. హుజూర్‌నగర్‌లోని శ్రీనగర్‌కాలనీకి చెందిన దంపతులు మామిడి గోపి, నాగమణి. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన దంపతులు జాదవ్ గణేశ్, శిరీష కలిసి ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం, సిద్దిపేటతో పాటు ఇతర జిల్లాల్లో పలు రకాల దొంగతనాలు చేసి 25 కేసుల్లో అరెస్ట్ అయి జైలు శిక్ష అనుభవించారు. చోరీ చేసిన సొత్తును స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ జిల్లాలోని స్క్రాప్‌షాప్ నిర్వాహకురాలికి విక్రయించారు. వీరి వద్ద నుంచి రెండు గుడి గంటలు, బంగారు ముక్కుపుడక, వెండి అమ్మవారి పట్టీలు, రూ. 4 వేలతో పాటు వారు ఉపయోగించిన ఆటో, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అనంతరం వీరిని రిమాండ్‌కు తరలించారు. వీరిని మండలంలోని జనగామ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా, పోలీసులను చూసి ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించగా, పలు ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఉదయం గ్రామాల్లో చెత్త ఏరుకుంటూ ఎక్కడెక్కడ ఆలయాలు ఉన్నాయో చూసి, రాత్రి అయిందంటే చాలు గుడి తాళాలు పగలగొట్టి అందులో ఉన్న విలువైన వస్తువులతో పాటు హుండీలను పగలగొట్టి డబ్బులను ఎత్తుకెళ్తారు. అలాగే విలువైన వస్తువులను అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేయడమే అలవాటుగా మార్చుకున్నారు.